

నేడు యథావిధిగా 'ప్రజాసమస్యల పరిష్కార వేదిక'

ప్రజాశక్తి-రాయచోటి

ప్రజల నుంచి వారి సమస్యలను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు ఈనెల 30న సోమవారం ఉదయం 10 గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా కేంద్రం రాయచోటి తో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో యధావిధిగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ విజ్ఞప్తులను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రాగలరని తెలిపారు.

వైద్యానికి..సుస్తీ!



- మందకొడిగా సూపర్‌స్పెషాలిటీ సేవలు
- పులివెందుల మెడికల్ కళాశాల సీట్లు గల్లంతేనా
- సిహెచ్‌సిల్లో వైద్యుల కొరతపై దృష్టి సారించాలి
- ఎంసెట్ కౌన్సెలింగ్...విద్యార్థుల్లో ఆందోళన
- నేడు జిల్లా సర్వజనాస్పత్రిలో వైద్య ఆర్యోశాఖ మంత్రి పర్యటన

జిల్లా వైద్య ఆరోగ్యరంగానికి సుస్తీ చేసింది. 2024-25 సంవత్సరంలో జిల్లాలో డెంగ్యూ, టైఫాయిడ్, మలేరియా వైరల్ జ్వరాలతోపాటు డయేరియా పెద్దఎత్తున ప్రబలిన సంగతి తెలిసిందే. ఇటువంటి పరిస్థితుల్లో జిల్లాలోని పిహెచ్‌సి, సిహెచ్‌సి, ఏరియా, జిల్లా ప్రభుత్వాస్పత్రుల్లో నాణ్యమైన సేవలు అందకపోవడంతో ప్రయివేటు ఆస్పత్రులకు పరుగులు తీయిస్తున్నారు. దీనికి తోడు జిల్లా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఆధునిక పరికరాల అమరిక దగ్గర నుంచి వైద్యుల నియామకం వంటి సమస్యలతో కునారిల్లుతోంది. ఇటీవలి ఎంసెట్ ప్రవేశ పరీక్షలకు హాజరైన వేలాది మంది విద్యార్థులకు కౌన్సెలింగ్ ఎప్పుడు ఉంటుందో తెలియని అయోమయ పరిస్థితిలో కొనసాగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో సోమవారం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖామంత్రి సత్యకుమార్ జిల్లా సర్వజనాస్పత్రి పరిశీలన నేపథ్యంలో కథనం..

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలో వైద్యఆరోగ్యరంగం సమస్యలతో సతమతమవుతోంది. పులివెందుల, మదనపల్లి మెడికల్ కళాశాలు 50 మెడికల్ సీట్ల చొప్పున కోల్పోవడంపై పెద్దఎత్తున చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. 2024-25 అకడమిక్ ఇయర్‌లో పులివెందుల, మదనపల్లి మెడికల్ కళాశాలల్లో మెడికల్ కోర్సులు నిర్వ హించాలనే ఉద్దేశంతో గత వైసిపి సర్కారు పనులను ముమ్మరం చేసింది. 20 24 సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారం చేతులు మారడంతో ఎన్డీయే సర్కారు పులివెందుల, మదనపల్లి మెడికల్ కళాశాలలో మెడికల్ సీట్ల నిర్వహణపై చేతులు ఎత్తేయడం ఆందోళన కలిగించింది. రాష్ట్రప్రభుత్వ అసమర్థత ఫలితంగా కడప, అన్నమయ్య జిల్లాలకు చెందిన పులివెందుల, మదనపల్లి మెడికల్ కళాశాలల అకడమిక్ ఇయర్ వాయిదా పడడం సర్వత్రా విమర్శల వర్షం కురుస్తోంది.

అధ్వానంగా సర్వజనుల సేవలు

జిల్లా ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి పర్యవేక్షణ అధ్వానంగా మారింది. రోజూ 1200 నుంచి 1600 మంది ఓపి రోగులు ఆస్పత్రికి వస్తుంటారు. వీరికి వైద్యసేవలు ఎలా అందుతున్నాయో పరిశీలన చేయాలి. ఉదయం, సాయంత్రం సర్వజన ఆస్పత్రి నిర్వాహకులు రౌండ్లగా వారీగా పర్యవేక్షణ నిర్వహించడంలో లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ఫలితంగా పలువురు వైద్యులు మధ్యాహ్నం లోపలే సొంత ఆస్పత్రులకు పరుగులు తీయడం పరిపాటిగా మారింది. గతంలో రిమ్స్ ప్రత్యేకాధికారి పని చేసిన ఐఎఎస్ అధికారి హయాంలో సాయంత్రం వరకు వైద్యులు విధులు నిర్వహించేవారు. సాయంత్రం వరకు ఓపి సేవలు అందుబాటులో ఉండేవి. ప్రస్తుతం ఇటువంటి ప్రసక్తే లేకపోవపడం గమనార్హం.



ఓపి కోసం క్యూలో వేచి ఉన్న రోగులు (ఫైల్‌ఫోటో)

మందకొడిగా సూపర్ స్పెషాలిటీ సేవలు

జిల్లా కేంద్రంలో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన జిల్లా సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిలో సుమారు రూ.60 కోట్లతో కూడిన ఆధునిక పరికరాలను కేటాయిం చింది. వీటిని ఏర్పాటు చేయడానికి సంబంధించిన టెక్నీషియన్లు లేకపోవడం, వైద్యపరీక్షలు నిలిచిపోవడంతో సూపర్ సేవలు అందడం లేదు. దీనికి తోడు 11 విభాగాలకు చెందిన వైద్య సేవలు అందుతున్నట్లు కనిపించినప్పటికీ ఆచరణలో రెండు, మూడు విభాగాల సేవలు అందుతుండడం ఆందోళన కలిగిస్తోంది. జిల్లాలో తొమ్మిది సిహెచ్‌సిల పనితీరు ఆశించిన రీతిలో కనిపించడం లేదు. బద్వేల్, పోరుమామిళ్ల పిహెచ్‌సిల్లో వైద్యుల కొరత పీడిస్తోంది. ఐదు నెలల కిందట ప్రభుత్వం ఎంసెట్ పరీక్షలు నిర్వహించింది. 2024-25 అకడమిక్ ఇయర్ ప్రారంభ మైంది. కానీ ఇప్పటివరకు ఎంసెట్ రాసిన వేలాది మంది విద్యార్థులు అడ్మిషన్లు అడ్మిషన్లు ఎప్పుడు ఉంటాయో తెలియడం లేదనే ఆందోళనలో ఉన్నారు.

1200 జిఎన్‌ఎంల్లో ఆందోళన

రాష్ట్రంలో 2400 మంది ఎఎన్‌ఎంలు గ్రామీణ ప్రాంతాల్లో విధులు నిర్వహించారు.వీరిలో 1200 మంది ఎఎన్‌ఎంలకు వైసిపి సర్కారు ఇన్ సర్వీస్ కింద జిఎన్‌ఎం కోర్సు పూర్తి చేసినట్లు గుర్తించి జిఎన్‌ఎమ్‌లు ప్రమోట్ చేసింది. తాజాగా ఎన్డీయే సర్కారు నేషనల్ నర్సింగ్ ఏజెన్సీ గుర్తింపు అవసరమనే నెపంతో నిలిపేయడంతో నర్సుల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ ఇటువంటి సమస్యలను పరిశీలించాల్సిన అవసరం ఎంతైనా ఉందనే వాదన వినిపిస్తోంది.

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం

జిల్లా భూ రికార్డుల సర్వే శాఖ సహాయ సంచాలకులు టి.జయరాజ్



ముఖా ముఖి..

ప్రజాశక్తి- రాయచోటి

జిల్లాలోని రైతులందరికీ అందుబాటులో ఉండి భూ సమస్యల పరిష్కారమే లక్ష్యమని జిల్లా భూ రికార్డులు, సర్వే శాఖ సహాయ సంచాలకులు టి. జయ రాజ్ పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లాల్లో రైతులకు భూ సమస్యలు ఎలా పరిష్కరించాలో, భూ సమస్యలను ఏ విధంగా పరిష్కరించుకోవాలో, రీ సర్వే ఎంత చేశారో, తదితర అంశాలపై ప్రజాశక్తికి ఇచ్చిన ముఖా ముఖిలో ఆయన వివరించారు.

అన్నమయ్య జిల్లాలో ఎన్ని గ్రామాలు ఉన్నాయి ?

అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా 30 మండలాలున్నాయి. రెవెన్యూ గ్రామాలు 470 ఉన్నాయి. మండల సర్వేయర్లు 30 మంది, విలేజ్ సర్వేర్లు 389 మంది ఉన్నారు.

జిల్లా వ్యాప్తంగా భూమి విస్తీర్ణం ఎంత ?

జిల్లా వ్యాప్తంగా మొత్తం భూమి విస్తీర్ణం 15,32,821.ఎకరాల 11 సెంట్లు ఉంది. 'భూ రీ సర్వే 2019వ సంవత్సరంలో ప్రారంభించాం. 2,73,674. ఎకరాల 02 సెంట్లు రీ సర్వే చేశాం.

భూ సమస్యల పై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు ?

సాధారణంగా భూ సమస్యలు ఎక్కువగా అన్నదమ్ములు మధ్య, సాగులో ఒకరు ఉంటే పట్టా పాసుపుస్తకంలో మరొకరి పేరు ఉండడం వంటి సమస్యలు ఉంటాయి. కొందరు సరిహద్దులు సమస్యలతో వస్తూ ఉంటారు. గ్రామ, మండల స్థాయిలో సర్వేర్లు ఉంటారు. అక్కడ న్యాయం జరగకపోతే ఆర్‌డిఒ కార్యాలయంలో ఫిర్యాదు చేసుకోవచ్చు. అక్కడ కూడా బాధితునికి న్యాయం జరగలేదని భావిస్తే జిల్లా స్థాయిలో తమ దగ్గర వస్తే, జిల్లా స్థాయి సర్వేలు వెళ్లి క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులకు న్యాయం చేస్తాం.

సర్వే చేయాలంటే డబ్బులు ఇవ్వాల్సిందేనా?

యజమాని భూమిని కొనాలన్నా, స్థలం చూపించాలన్నా అర్జీ పెట్టుకోవాలి. ప్రభుత్వానికి నేరుగా డిడి, చలానా రూపంలో భూమి కొలతల మేర చలానా చెల్లించాలి. ఇది మినహా సర్వేయర్ అదనంగా ఎలాంటి డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదు. ఎవరికి డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదు. ఎవరైనా డబ్బులు అడిగినట్లు తమ దృష్టికి తీసుకొస్తే వారి పైన కఠిన చర్యలు తీసుకుంటాం.

సిబ్బంది కొరత సమస్య ఏమైనా ఉందా?

గతంలో భూ రికార్డుల సర్వే శాఖలు సిబ్బంది కొరత ఉండేది. ప్రస్తుతం ప్రతి సచివాలయానికి ఒక సర్వేయర్, మండలానికి మరో సర్వేయర్ ఉన్నారు. ఆర్జీలు వచ్చిన వెంటనే ఆ గ్రామ సచివాలయ సర్వేర్ కొలతలు వేస్తున్నారు. సిబ్బంది కొరతతో ఎలాంటి సమస్య లేదు.

ప్రజలకు మీరు ఇచ్చే సలహాలు, సూచనలు ఏమిటి ?

ప్రజలు వీలైనంతవరకు చిన్న చిన్న భూ సమస్యలు అక్కడ ఉన్న పెద్ద మనుషులతోనే పరిష్కరించుకోవాలి. దీనివల్ల కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండదు. తప్పని పరిస్థితిలో మాత్రమే సర్వేర్లను కలవాలి. అక్కడ కూడా పరిష్కారం కాకపోతే తమ కార్యాలయంలో రైతులు కలిసి సమస్యలు పరిష్కరించుకోవచ్చును.

ఉత్సాహంగా యుటిఎఫ్ క్రీడా పోటీలు

ప్రారంభించిన డిఇఒ శివప్రకాష్‌రెడ్డి

ప్రజా శక్తి రాయచోటి

యుటిఎఫ్ ఆవిర్భవించి 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జిల్లా స్థాయి క్రీడా పోటీలను నేతాజీ స్కూల్ మైదానంలో పోటీలను ఉత్సాహంగా నిర్వహించారు. జిల్లా విద్యా శాఖ అధికారి యు .శివ ప్రకాష్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎప్పుడూ పాఠ్య పుస్తకాలతోటి కుస్తీ పడుకుండా ఉపాధ్యాయులు అప్పుడప్పుడూ ఇలాంటి క్రీడల్లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. యుటిఎఫ్ పోరాటాలే కాకుండా సామాజిక సేవలో ముందుండడం అభినందనీయమన్నారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు హరిప్రసాద్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు క్రీడలలో పాల్గొనడం వల్ల శారీరక మానసిక ఉల్లాసం, ఒత్తిడి లేని బోధనను కొనసాగించడానికి ఎంతగానో ఉపయోగపడతాయని, పైగా శరీరంలోని అనేక రుగ్మతలను పోగొట్టవచ్చని తెలియజేశారు. ఉపాధ్యాయులు క్రీడలు ఆడడం వల్ల విద్యార్థులకు కూడా స్ఫూర్తిదాయకంగా ఉంటుందని చెప్పారు. జిల్లా ప్రధాన కార్యదర్శి జాబిర్ మాట్లాడుతూ పాఠ్య ప్రణాళికలు, వివిధ రకాల యాప్‌ల నిర్వహణ, శిక్షణలు, పిల్లలకు పాఠాలు చెప్పడమే కాకుండా నిజజీవితంలో కొంత సమయాన్ని క్రీడలకు, వ్యాయామానికి కేటాయిస్తే అనేక ఆరోగ్య సమస్యలు రాకుండా ఉండడమే కాక ఆర్థికంగా కూడా ఇబ్బంది పడకుండా ఉండవచ్చున్నారు. సాయంత్రం 6 గంటల వరకు హోరాహోరీగా జరిగిన క్రికెట్ పోటీలు ముగిసిన తరువాత బహుమతి ప్రధానోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీ రాజా మాట్లాడుతూ జిల్లా స్థాయిలో గెలుపొందిన క్రీడాకారులు అక్టోబర్ 3,4, 5 తేదీల్లో గుంటూరులో జరిగే రాష్ట్ర స్థాయి క్రీడల్లో పాల్గొంటారని చెప్పారు. అనంతరం క్రీడాకారులకు బహుమతులను అందజేశారు. యన్. నరసరాజు ఆలీమాబాద్ ఉర్దూ పాఠశాల పీడీ రెండు రోజులుగా అలుపెరకుండా నిర్వహణ ఏర్పాట్లు చేశారు. సందర్భంగా నరసరాజుకి యుటిఎఫ్ జిల్లా సంఘం తరపున కృతజ్ఞతలు తెలియజేశారు. ఇండోర్ స్టేడియంలో జరిగిన షటిల్ బ్యాడ్మింటన్ డబుల్, సింగిల్ పోటీలు అలీమాబాద్ జిల్లా పరిషత్ ఉర్దూ ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయులు జగదీష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. రసవత్తంగా జరిగిన చెస్ పోటీలలో నందలూరు మండలం అధ్యక్షులు రమేష్ జోసి మొదటి స్థానంలో, సుండుపల్లె మండలంలో పనిచేస్తున్న సుభాన్ రెండో స్థానంలో నిలిచారు. షార్ట్ పుట్ విసరడంలో కలికిరి మండలంలో పనిచేస్తున్న నాగరాజు మొదటి స్థానంలో నిలిచారు. షటిల్ బ్యాడ్మింటన్ సింగిల్స్ లో రాజంపేట మండలంలో పనిచేస్తున్న ఈశ్వర్ నాయక్ గెలిచారు. బ్యాడ్మింటన్ డబుల్స్ చంద్రకుమార్, హరికృష్ణ విజయం సాధించారు. క్యారమ్స్ పోటీలలో రమేష్ జోషి, సుధాకర్ గెలిచారు. క్రికెట్ ఫైనల్ మ్యాచ్లో రాయచోటి వారు గెలుపొందారు. కార్యక్రమంలో కోశాధికారి బి.చంద్రశేఖర్, కార్యదర్శులు దావుద్దీన్, వెంకట్ సుబ్బయ్య, రమణమూర్తి, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ సురేంద్ర రెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్లు చంగల్ రాజు, శివారెడ్డి వివిధ మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



క్రీడలను ప్రారంభిస్తున్న డిఇఒ శివప్రకాష్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఇఒ రెడ్డి బాష



సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలకు జట్లు ఎంపిక

ప్రజాశక్తి-పీలేరు

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ -19 జట్ల ఎంపికలు ఆదివారం కెవి పల్లి మండలం, గ్యారంపల్లె గురుకుల జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అంతర్ జిల్లా స్థాయి నిర్వహించారు. ఈ సందర్భంగా హ్యాండ్‌బాల్, త్రోబాల్, టెన్నికాయిట్, రగ్బీ విభాగాల్లో పోటీలు నిర్వహించి విజేతలను ఎంపిక చేశారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చెన్నకేశవులు ఆధ్వర్యంలో చేపట్టారు. జిల్లా ఎస్‌టిఎఫ్ అండర్-19 జిల్లా సెక్రటరీ జయరామయ్య, ఎంఇఒ పి. రెడ్డిబాష, సర్పంచ్ రెడ్డెప్ప, మాజీ సర్పంచ్ వెంకటరమణారెడ్డి పాల్గొని పోటీలను ప్రారంభించారు. ఈసందర్భంగా ఎంఇఒ, ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు చాలా ముఖ్యమని చెప్పారు. గేమ్స్ అండ్ స్పోర్ట్సు ఆడేవారికి చక్కటి శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగ్గా ఉంటాయన్నారు. విద్యలోనూ చక్కగా రాణిస్తారన్నారు. విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. క్రీడల్లో రాణించిన విద్యార్థులకు ఉన్నత చదువులు, ఉద్యోగాల్లో రిజర్వేషన్ సౌకర్యాలు ఉంటాయని అన్నారు. ఈ ఆటల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో జిల్లా స్పోర్ట్సు అధికారులు, కళాశాల అధ్యాపకులు రమాదేవి, కొండయ్య, షకీల్, అహ్మద్, నాగేంద్ర, నాగరాజనాయక్, అన్నపూర్ణ, సౌజన్య వివిధ కళాశాలల ఫిజికల్ డైరెక్టర్లు పురుషోత్తం, మురళీధర్ రెడ్డి పాల్గొన్నారు.

దంపతులపై కందిరీగల దాడి

- భర్త మృతి, భార్యకు తీవ్ర అస్వస్థత

- బండ్రేవులో అలుముకున్న విషాదం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

అన్నమయ్య జిల్లాల్లో విషాదం చోటు చేసుకుంది. తంబళ్లపల్లె నియోజకవర్గంలోని పెద్దమండ్యం మండలం, బండ్రేవులో కందిరీగలు దంపతులను తీవ్రంగా గాయపరిచాయి. ఈ సంఘటనలో భర్త మృతిచెందాడు. భార్య ప్రాణాపాయం నుంచి తప్పించుకుంది. మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు మేరకు.. పెద్దమండ్యం మండలంలోని బండ్రేవుకులో వైసిపికి నాయకుడు మల్లికార్జునరెడ్డికి చెందిన మామిడితోటలో ఆర్‌ఎంపి డాక్టర్ భాస్కర్(46), అతని భార్య రవణమ్మ(36) వ్యవసాయం చేసేవారు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం మామిడి తోటలో ఉన్న దంపతులపై కందరీగలు దాడి చేయడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. గమనించిన స్థానికులు బాధితులను తంబళ్లపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మదనపల్లె సర్వజన బోధనాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు భాస్కర్ అప్పటికే చనిపోయినట్లు వెల్లడించారు. మృతుని భార్య రమణమ్మకు మెరుగైన వైద్యం అందించడంతో ప్రాణాపాయం తప్పి కోలుకుంటు ఉంది.

కందిరీగల దాడిలో ఆర్‌ఎంపి డాక్టర్ భాస్కర్ మృతి చెందిన విషయం తెలుసుకున్న బండ్రేవు గ్రామస్తులు విచారం వ్యక్తం చేశారు. చిన్న ఆపద ఉన్న అర్థరాత్రిలో వచ్చి వైద్యం అందించే డాక్టర్ ఇక లేదని బాధపడ్డారు. బండ్రేవు మొత్తం భాస్కర్ మృతితో కన్నీటి పర్వంతమయ్యారు.

నేడు కలెక్టరేట్ ఎదుట ధర్నా :'సిటు'

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, కార్మిక ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని సోమవారం కలెక్టరేట్ ఎదుట నిర్వహించబోయే ధర్నా జయప్రదం చేయాలని సిఐటియు జిల్లాఅధ్యక్షులు సి హెచ్ చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు, కోశాధికారి టి.హరిశర్మ పిలుపునిచ్చారు. ఆదివారం సిఐటియు జిల్లా కార్యాలయం లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో వారు మాట్లాడుతూ ప్రతి ఎన్నికల ముందు కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ వారిని రెగ్యులర్ చేస్తామని అధికారం చేపట్టాక ఖజానా ఖాళీ అని ద్రోహం చేస్తున్నారని విమర్శించారు. ప్రతి ప్రభుత్వ సంస్థ లో పని చేస్తున్న అన్ని రకాల విభాగల వారికి సమానపనికి సమాన వేతనం అమలు చేయాలని ఈ దేశ అత్యున్నత న్యాయ స్థానం సుప్రీం కోర్టు పిలుపిస్తే ఏ ఒక్కరూ అమలు చేయకపోవడం దారుణమని అన్నారు. పని గంటలు పెంచడం,సెలవులు ఇవ్వకపోవడం , చేసిన పనికి సకాలంలో వేతనాలు ఇవ్వకపోవడం, భద్రత లేని ఉద్యోగాలు కార్మికఉద్యోగ చట్టాల రక్షణకై జరుగుతున్న ఆందోళన కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు.

పోరాటాలతోనే సమస్యలకు పరిష్కారం

ప్రజాశక్తి-వాల్మీకిపురం

మాలల కలసికట్టుగా సమస్యలపై రాజీలేని పోరాటాలు చేసి పరిష్కరించుకోవాలని మాలమహానాడు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ యమల సుదర్శనం అన్నారు. ఆదివారం స్థానిక గాంధీబస్టాండ్ వద్ద డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పట్టణ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించి మాలమహానాడు నినాదాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్‌సి వర్గీకరణకు వ్యతిరేకంగా కోర్టు ఇచ్చిన తీర్పును ఖండిస్తున్నామన్నారు. అన్ని దళిత సంఘాలు ఐక్యమై పోరాడి హక్కులను సాధించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మాలలు అందరూ ఐక్యతగా ఉంటే ప్రభుత్వాల నుంచి తమ హక్కులను సాధించుకునేందుకు వీలుంటుందని చెప్పారు. అనంతరం మాల మహానాడు నూతన కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు చంద్రయ్య, శివయ్య, మనోహర్, వెంకటస్వామి, మల్లెల మోహన్, సుధాకర్, బివి రమణ, గాంధీపేట రఘు, నరేష్, హరి, నాగార్జున, మద్దెల రవి, చిరంజీవి, ప్రవీణ్, అశోక్, సూరి పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న మాలమహానాడు నాయకులు

కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంకు వందేళ్ల విజయ పరంపర



సమావేశంలో మాట్లాడుతున్న అసిస్టెంట్ రిజిస్ట్రార్ శ్యామ్‌ప్రకాష్‌రెడ్డి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

దిమదనపల్లి కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంకు 100ఏళ్ల విజయ పరంపరను కొనసాగించింది. ఈ మేరకు ఆదివారం బ్యాంకు ప్రధాన కార్యాలయంలో వందేళ్ల వార్షిక మహాజన సభ నిర్వహించారు. సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ శ్యాంప్రకాశ్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ముఖ్య కార్య నిర్వాహకాధికారి వి.వి.ప్రసాద్ మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరాం తానికి రూ. 90.84 కోట్లు డిపాజిట్లు ఉన్నాయని, బ్యాంకు ఇచ్చిన ఋణాలు రూ. 58. 86 కోట్లు ఉండగా వ్యాపార ధనం రూ. 111.31 కోట్లు ఉన్నట్లు తెలిపారు. ఇందులో రూ.2,05,85,499 స్థూల లాభం కాగా, రూ. 52,02,926 లు ఇన్కమ్ ట్యాక్స్ చెల్లించి, రూ.1,53,82,573 నికర లాభం వచ్చినట్లు తెలిపారు. 2023 - 24 ఆర్థిక సంవత్సరానికి షేరు ధనంపై 10శాతం డివిడెండు చెల్లించగా, బ్యాంకు స్థూల నిరర్థక ఆస్తులు 5.72శాతం, నికర నిరర్థక ఆస్తులు 0.95 శాతం ఉన్నాయన్నారు. రిజర్వు బ్యాంకు తాజా నిభందనల ప్రకారం నిరర్థక ఆస్తుల గుర్తింపు నిరంతర ప్రక్రియగా చేపట్టాల్సి ఉన్నందున ఖాతాదారులు అందరూ తీసుకొన్న రుణాలను సక్రమంగా చెల్లించాలని కోరారు. రిజర్వు బ్యాంకు నిభంధనల మేరకు బ్యాంకు లావాదేవీలు చేపడుతున్నామన్నారు. బ్యాంకు పాలక వర్గం ఏర్పడిన తర్వాత బ్యాంకు శతవార్షిక ఉత్సవాలను ఒక ఏడాది పాటు ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో బ్యాంకు ఆడిటర్లు కెఎస్‌ఎస్ ప్రసాద్, పిఎస్ చైతన్య, బ్యాంకు మేనేజర్లు సుధారాణి, జయచంద్ర నాయుడు, రవిచంద్రారెడ్డి, రాధిక, రాజశేఖర్, మరియు ఖాతాదారులు, బ్యాంకు సిబ్బంది, మాజీ డైరెటర్లు పసుపు రవి, రియాజ్, మధుకర్, సయ్యద్ ఖాన్, సోమశేఖర్, భాస్కర్ కుమార్ పాల్గొన్నారు.

కేన్సర్ రోగులకు కేశాలు వితరణ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లి ముఖ్య కేంద్రంగా రక్తదానం, ఫుడ్ బ్యాంక్స్, సానిటరి ప్యాడ్ బ్యాంక్స్, బాడీ ఫ్రీజర్ బాక్స్ సేవలతోపాటు కేన్సర్ బాధితులకు మానసికంగా తోడు నిలవాలనే గొప్ప ఆశయంతో హెల్పింగ్ మైండ్స్ హెయిర్ డోనేషన్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. మహిళలు, చిన్నారులు స్వచ్ఛందంగా తమ కేశాలను దానం చేసి గొప్ప మనసస్సును చాటుకుంటున్నారు. మదనపల్లి పట్టణానికి చెందిన శబరినాథ్, తేజశ్విని దంపతుల కుమార్తె సాయిమాన్య ఆదివారం హెల్పింగ్ మైండ్స్ కార్యాలయానికి విచ్చేసి కేన్సర్ బాధితుల కోసం కేశాలు దానం చేసి ఆదర్శంగా నిలిచింది. కేశాలు దానం చేసిన సాయి మాన్యకు ప్రశంసా పత్రంతో పాటు పూల మొక్క బహూకరించి హెల్పింగ్ మైండ్స్ బృందం అభినందించారు. ఈ సందర్భంగా హెల్పింగ్ మైండ్స్ వ్యవస్థాపకుడు అబూబక్కర్ సిద్దిక్ మాట్లాడుతూ కేన్సర్ బాధితులకు తమ సంస్థ ఉచితంగా విగ్గులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికి 61 మంది కేశాలు దానం చేశారని, మహిళలు, చిన్నారులు కేశాలు దానం చేస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. కుటుంబ సభ్యుల ప్రోత్సాహం వల్ల కేశాలు దానం చేసినట్లు సాయి మాన్య తెలిపింది. కార్యక్రమంలో హెల్పింగ్ మైండ్స్ సభ్యులు కిరణ్, ఖాజా పాల్గొన్నారు.



కేశాలు దానం చేస్తున్న సాయిమాన్య



అవార్డును అందుకుంటున్న సుబ్బ నరసారెడ్డి

సుబ్బ నరసారెడ్డికి 'కడప సేవా రత్న అవార్డు'

ప్రజాశక్తి-పుల్లంపేట

పుల్లంపేట విభిన్న ప్రతిభావంతుల సమైక్య సేవా సంఘం అధ్యక్షుడికి శ్రీ వెంకటలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ వారు విభిన్న ప్రతిభావంతుల సమైక్య సేవా సంఘం చేసిన పలు సేవా కార్యక్రమాలకు కడప సేవా రత్న అవార్డును ప్రదానం చేశారు. ఈ అవార్డు కడప జిల్లాలోని వైఎస్ఆర్ ప్రెస్ క్లబ్ నందు శ్రీ వెంకటలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ మొదటి వార్షికోత్సవం సందర్భంగా పలు సేవామూర్తులకు అవార్డు ప్రకటించింది. ఈ సందర్భంగా పుల్లంపేటకు విభిన్న ప్రతిభావంతుల సమైక్య సేవా సంఘానికి రావడం చాలా సంతోషంగా ఉంది భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తానని అధ్యక్షుడు మల్లు సుబ్బనరసారెడ్డి తెలిపారు. మా సేవా కార్యక్రమాలు సహకరించిన దాతలకు, సంఘ సభ్యులకు సమాజ సేవకులకు కృతజ్ఞతలు తెలిపారు.

చంద్రబాబును కలిసిన లక్ష్మీనారాయణ


ప్రజాశక్తి-రాజంపేట అర్బన్



చంద్రబాబుతో లక్ష్మీనారాయణ

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును టిడిపి లీగల్ సెల్ అధ్యక్షులు తరిగోపుల లక్ష్మీనారాయణ ఆదివారం విజయవాడలో మర్యాద పూర్వ కంగా కలిశారు. రాజంపేట నియోజకవర్గాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేసి జిల్లా కేంద్రం చేయాలని చంద్రబాబును కోరినట్లు లక్ష్మీనారాయణ తెలిపారు.

మంత్రి 'నాదెండ్ల'తో మహేష్..



మంత్రి నాదెండ్ల మనోహర్‌తో మహేష్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను తప్పక అమలు చేస్తామని పౌరసరఫరాల శాఖ మంత్రి, జనసేన పిఎసి చైర్మన్ నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారని జనసేన పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మైఫోర్స్ మహేష్ పేర్కొన్నారు. ఆదివారం మంత్రి నాదెండ్లను కలిసినట్లు ఆయన తెలిపారు. కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో భాగంగా త్వరలో ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీ ఉంటుందన్నారు. దీనిపైన కూటమి నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. ప్రభుత్వం పై వైసిపి చేస్తున్న అసత్య ప్రచారాలను తిప్పికొడుతూ త్వరలోనే ఆరు గ్యారెంటీలు అమలు చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. వైసిపి పాలనలో జరిగిన అవకతవకులు సరి చేస్తూ ప్రజా పాలన సజావుగా జరిగే విధంగా చర్యలు తీసుకునేందుకు కొంత సమయం తీసుకుంటున్నట్లు తెలిపారు.



మాట్లాడుతున్న పివి.నాయుడు

'మానవత' అభివృద్ధికి కృషి చేద్దాం

ప్రజాశక్తి-కలకడ

మానవత సేవ స్వచ్ఛంద సంస్థ అభివృద్ధికి కృషి చేద్దామని మండల అధ్యక్షులు పివి.నాయుడు కొనియాడారు. కలకడ మండలంలోని స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా పక్క మండలాలైన కె.విపల్లి, కలికిరి, గుర్రంకొండ మండలాల్లో కూడా సేవలను బలోపేతం చేసి మానవత స్వచ్ఛంద సేవా సంస్థను అభివృద్ధి చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. 2023- 24 సంవత్సరానికి గాను సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టి సంస్థను ఆర్థికంగా బలోపేతం చేసి ప్రజలకు మరింత చేరువ చేసి ప్రజలకు సేవ చేసేందుకు ముందుంటుందని తెలిపారు. స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయం వద్ద మొక్కలు నాటే కార్యక్ర మాన్ని చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు గంగాద్రి నాయుడు, శ్రీనివాసులు రెడ్డి ,కార్యదర్శులు వెంకటేశ్వరరావు, కాజా పీర్, వై వి రమణ, పివి రమణ, మోహన , వెంకటసుబ్బయ్య, నాగేశ్వర, సుధాకర పాల్గొన్నారు.



పిడుగుపాటుకు మృతి చెందిన పశువులు

పిడుగుపాటుకు పశువులు మృతి

ప్రజాశక్తి - రామసముద్రం

పిడుగుపాటుకు గురై రెండు పాడి పశువులు మృతి చెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... మండలంలో ఆదివారం తెల్లవారుజామున పడిన వర్షం కారణంగా ఆర్.నడింపల్లి పంచాయతీ, దిగువబొంపల్లి గ్రామానికి చెందిన సుశీలమ్మకు చెందిన రెండు పాడి పశువులు పిడుగుపాటుకు గురై మృతి చెందాయి. కుటుంబం పోషణకు వాటిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఉన్న రెండు పాడిపశువులు మృతి చెందడంతో ప్రభుత్వం తమను ఆదుకోవాలని జిల్లా ఉన్నతాధికారులను బాధితులు కోరుకుంటున్నారు. పాడిపశువులు విలువ సుమారు లక్షా యాభైవేలు ఉంటుందని తెలిపారు.

'అక్షరధాత్రి' పేద విద్యార్థులకు వరం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్



మాట్లాడుతున్న డాక్టర్ స్వాతి

పేద పిల్లలకు ఉచితను విద్యను అందించడమే అక్షరధాత్రి కేంద్రాల ముఖ్య ఉద్దేశ్యమని ధాత్రి ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ స్వాతి చక్రపాణి స్పష్టం చేశారు. మంజుల పవర్ ఛానల్, జీవధాత సేవా ట్రస్ట్ అధినేత మంజుల ఆదివారం మదనపల్లి ధాత్రీ ఆనంద నిలయంలో మరో 10 అక్షరధాత్రి కేంద్రాలకు శ్రీకారం చుట్టారు. పది అక్షరధాత్రీ సెంటర్లకు సహాయ, సహకారాలు అందించబోతున్న మంజులమ్మకు ధాత్రి ఫౌండేషన్ నిర్వాహకురాలు డాక్టర్ స్వాతి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణంలో నిరుపేద విద్యార్థులకు సాయంత్రం వేళ ప్రత్యేకంగా టీచర్లను నియమించి విద్యాబోధన చేయడం జరుగుతుందన్నారు. తద్వారా విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తున్నట్లు తెలిపారు.ఈ అవకాశాన్ని నిరుపేద విద్యార్థులు సద్వినియోగం చేసుకో వాలని కోరారు. తిప్పన్న, గిరీష్-రేఖ దంపతులు, అమ్మ అక్షరధాత్రి సిబ్బంది, విద్యార్థులు, వృద్ధులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణ దాతలుకండి :'సుగవాసి'

ప్రజాశక్తి-రాయచోటి



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న సుగవాసి ప్రసాద్‌బాబు

ప్రాణాపాయ స్థితిలో వున్న వారికి స్వచ్ఛందంగా రక్తదానం చేసి ప్రణాదాతలు కావాలని టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి, టిటిడి పాలకమండలి మాజీ సభ్యులు సుగవాసి ప్రసాద్‌బాబు అన్నారు. ఆదివారం పట్టణంలోని శ్రీదీపా బ్లడ్ బ్యాంక్‌లో జరియా ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో ఆదివారం రక్తదానం కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి సుగవాసి ప్రసాద్‌బాబు ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. వారికి నిర్వహకులు ఘనస్వాగతం పలికి సన్మానించారు. అనంతరం రక్తం నిల్వలు తదితర అంశాలపై దీప బ్లడ్ బ్యాంక్ నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రసాద్ బాబు మాట్లాడుతూ ఎంతో మందికి సరైన సమయాలలో రక్తం దొరకక అవస్థలు పడుతూ ప్రాణాలు కోల్పోవాల్సిన దుస్థితి ఉందన్నారు. ఇటువంటి సందర్భంలో ఎంతో మంది యువకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయడం చాలా హర్షణీయమని అన్నారు. బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు చేసి రక్తాన్ని నిల్వ ఉంచి అవసరం అయ్యే వారికి రక్తం అందజేస్తున్న బ్లడ్ బ్యాంక్ వారిని కూడా ప్రసాద్ బాబు అభినందించారు.18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ రక్తదానం చేయవచ్చున్నారు. రక్తం దానం చేయడం వల్ల ఇంకా ఆరోగ్య వంతులుగా ఉంటారన్నారు. జరియా ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో ఇటువంటి సేవా కార్యక్రమాలు చేసి ప్రజల మన్ననలను పొందాలని ఆకాక్షించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు డాక్టర్ మహేశ్వరాజు, జరియా ఫౌండేషన్ సభ్యులు జిలాన్, నావాజ్, ఉమర్, ఖాజా, ఖైజర్, బాబ్జి, ఇర్షాద్, ఫర్హాన్, జబీర్ క్రిష్, మాకడూమ్, రామాంజనేయులు, బడిశెట్టి రవి, వాసు పాల్గొన్నారు.

కుటుంబాన్ని అస్తవ్యస్తం చేసిన మెదడువాపు వ్యాధి

ఆపన్న హస్తం కోసం అభాగ్యుల ఎదురుచూపు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్



మంచానికి పరిమితమైన పెంచలయ్య

భార్య, అత్తతో కలిసి ఉన్నంతలో తిని అప్పు లేకుండా సాఫీగా సాగిన వారి సంసారం ఇంటి యజమానికి మెదడువాపు వ్యాధి సోకడంతో ఒక్కసారిగా ఆ కుటుంబంలో విషాద ఛాయలు అలుముకొని కుటుంబాన్ని రోడ్డున పడేసింది. పెనగలూరు మండలం ఎన్ఆర్ పురం గ్రామానికి చెందిన సిద్ధం పెంచలయ్య జీవనోపాధి నిమిత్తం కొన్నాళ్ల క్రితం రాజంపేటకు వలస వచ్చి బిఎస్ థియేటర్ సమీపంలో ఒక చిన్న కూల్ డ్రింక్ షాప్ పెట్టుకుని అద్దె ఇంట్లో జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల అకస్మాత్తుగా అనారోగ్యం బారిన పడగా వైద్యులు పరీక్షలు చేసి తలలో శస్త్ర చికిత్స చేసి తలలోని ముఖ్యమైన అవయవాన్ని కడుపులో అమర్చి ప్రాణం నిలిపారు. కానీ.. కాలు, చేయి పూర్తిగా పడ పోవడంతో గత నాలుగు నెలలుగా మంచానికే పరిమితమై భార్య నాగమణితో సేవలందించుకుంటున్నాడు.బాధితుడి భార్య మాట్లాడుతూ సుమారు రూ .5 లక్షలు అప్పుచేసి రెండు పర్యాయాలు శస్త్ర చికిత్స చేయించుకుని జీవనోపాధి కోల్పోయి ఇంటికి అద్దె కట్టుకునే స్తోమత కూడా లేక దారిద్ర్యంతో అలమటిస్తున్నామని అన్నారు. పలకరించే దిక్కు లేక, మరణించే ధైర్యం లేక నాలుగు గోడల మధ్య ఆకలి కేకలతో అలమటిస్తూ బ్రతుకు వెళ్ళదీస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పెంచలయ్య అత్త లక్ష్మీనరసమ్మ కూడా ఉండటంతో రెండు పూటలా తిండికి కూడా కష్టమై అలమటిస్తున్నారు. పెంచలయ్యకు వచ్చే సామాజిక పింఛన్‌తో ఇంటి అద్దె కట్టుకుంటూ కూల్ డ్రింక్ షాప్ నిర్వహించుకొనే శక్తి లేక ఆపన్న హస్తం కోసం ఎదురుచూస్తున్నారు. మరో మారు వైద్య పరీక్షలకు రావాలని వైద్యులు సూచించగా తీసుకున్న అప్పు చెల్లించలేని స్థితిలో ఉన్నామని మరలా వైద్యం చేయించుకొనే స్థోమత లేదని అన్నారు. ఇంటి యజమాని మంచాన పడడంతో ఆ ఇల్లాలు దిక్కుతోచని స్థితిలో కంటికి మంటికి రోదిస్తూ చేయూతనిచ్చే సాయం కోసం ఎదురు చూస్తోంది. దళితుడైన పెంచలయ్య కుటుంబాన్ని దాతలు ఎవరైనా ముందుకొచ్చి సాయమందించి ఆదుకోవాలని ఆయన భార్య నాగమణి ముకులిత హస్తాలతో వేడుకుంటోంది. సాయం చేయదలచుకున్న దాతలు 96189 17605 నెంబర్ ను సంప్రదించి తోచినంత సాయం చేయాలని వేడుకుంటున్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



ఉచిత వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ శివారెడ్డి

ప్రజాశక్తి-మదనపల్లి

వరల్డ్‌హార్ట్ డే సందర్భంగా స్థానిక బీటీ కళాశాల మైదానంలో ఆదివారం మదనపల్లి సొసైటీ కాలనీలోని నిమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ శివారెడ్డి ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 150 మందికి పైగా ఇసిజి, ఎకో, షుగర్, బిపి పరీక్షలు చేశారు. డాక్టర్ శివారెడ్డి మాట్లాడుతూ ఇటీవల గుండె పోటుతో అనేకమంది మృత్యువాత పడుతున్నారని తెలిపారు. ఇందుకోసం ముందుగానే పరీక్షలు నిర్వహించుకోవాలని సూచించారు. సరైన ఆహారం, వ్యాయామం, మంచి అలవాట్లు చేసుకోవాలని తెలిపారు. నిమ్స్ ఆస్పత్రిలో అన్ని రకాల వైద్య సేవలు ఉన్నాయని అన్నారు. వైద్యసేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పట్టణ వన్ టౌన్ సిఐ చాంద్‌బాషా, పీడీలు ప్రసాద్‌రెడ్డి, రాంబాబు, కార్తీక్‌కుమార్‌రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలకు వైద్య పరీక్షలు

రామసముద్రం : రామసముద్రంలోని ఈస్ట్ పాఠశాలలో మదనపల్లి ఉమాదేవి మెటర్నిటీ జనరనల్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత స్త్రీ వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా స్త్రీ వైద్య నిపుణులు డాక్టర్ ఉమాదేవి మాట్లాడుతూ ఈ వైద్య శిబిరంలో స్త్రీలకు సంబంధించిన పలు రకాల వైద్య చికిత్సలు రక్తహీనత, అధిక రక్తపోటు, వాతం, షుగర్ వ్యాధి ,గుండెజబ్బులు, థైరాయిడ్, ఫిట్స్, ఇతర సమస్యలకు సలహాలు, సూచనలు , చికిత్సలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. మెరుగైన చికిత్సలు అవసరమైన వారికి అక్టోబర్ మొదటి వారంలో తమ ఆస్పత్రిలో వైద్యం అందించనున్నట్లు తెలిపారు.

'జ్ఞానాంబిక'లో ఉచిత కంటి ..

మదనపల్లి : స్థానిక శ్రీ జ్ఞానంబికా డిగ్రీ కళాశాలలో తిరుపతికి చెందిన అరబిందో కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించామని కరస్పాండెంట్ డాక్టర్ రాటకొండ గురుప్రసాద్ తెలిపారు. ఈ వైద్య శిబిరంలో 93 మంది కంటి జబ్బులు వున్నవారు రాగా వారికి పరీక్షలు చేసి 13 మందిని శస్త్ర చికిత్సకు ఎంపిక చేశారన్నారు. అరబిందోకంటి ఆస్పత్రిలో ఉచితంగా కంటి శస్త్రచికిత్సలు చేయనున్నారని తెలిపారు.ఉచిత కంటి శిబిరంలో డాక్టర్ శ్రేయ, కరస్పాండెంట్ ఆర్.గురుప్రసాద్,వినోద్ పాల్గొన్నారు.

రేపు రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-కలికిరి : రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని సేవా సంకల్ప చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు రియాజుల్లా, ఇనాయతుల్లా పిలుపునిచ్చారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లా డుతూ నేషనల్ వాలంటరీ బ్లడ్ డొనేషన్ డే సందర్భంగా మంగళవారం స్థానిక ఎల్లమ్మ గుడి ఆవరణంలో నిర్వహిస్తున్న రక్తదాన శిబిరంలో దాతలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.



గౌరవ డాక్టరేట్ అందుకుంటున్న షేక్ మొహమ్మద్ అలీ

మహమ్మద్ అలీకి డాక్టరేట్

ప్రజాశక్తి-పీలేరు

న్యూఢిల్లీలోని 'వెల్ ఎడ్యుకేషనల్ అండ్ పీస్ కౌన్సిల్' సంస్థ నుంచి మైనారిటీ నాయకుడు షేక్ మహమ్మద్ అలీ గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. న్యూఢిల్లీలోని కాన్స్టిట్యూషన్ క్లబ్‌లో ఆదివారం జరిగిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో పులిచెర్ల మండలం, కల్లూరుకు చెందిన షేక్ మహమ్మద్ అలీ భారత నైపుణ్యాభివృద్ధి సంస్థ చైర్మన్ బిష్ణు ప్రసాద్,చేతుల మీదుగా గౌరవ డాక్టరేట్ పట్టాను స్వీకరించారు. గత కొంతకాలంగా ఆయన చేస్తూన్న సామాజిక సేవా కార్యక్రమాలను గుర్తించి గౌరవ డాక్టరేట్ పట్టాను ప్రదానం చేసినట్లు ఆయన పేర్కొన్నారు. గతంలో మహమ్మద్ అలీ జాతీయ ఉక్కు వినియోగదారుల మండలి సభ్యుడిగా కూడా సేవలందించారు. గౌరవ డాక్టరేట్ పట్టాను అందుకున్న మహమ్మద్ అలీని పీలేరు సర్పంచ్ డాక్టర్ షేక్ హబీబ్ బాషా, రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్ అభినందించారు.

ఎన్‌సిసి సర్టిఫికెట్లు అందజేత

ప్రజాశక్తి-మదనపల్లి

అంగళ్లు సమీపంలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎన్‌సిసి సర్టిఫికేట్లను అందించినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ యువరాజ్ తెలిపారు. మొత్తం 29 మంది విద్యార్థులతకు ఈ సర్టిఫికేట్ అందించారని అందులో 28కి ఎ సర్టిఫికెట్స్, ఒక్కరికి బి సర్టిఫికెట్ అందించినట్లు పేర్కొన్నారు. ఈ సర్టిఫికెట్స్ ను 35 ఆంధ్ర బెటాలియన్, చిత్తూరు ఎఒ లోకనాథ్, సుబేదార్ మేజర్ బిబిచత్రి సర్టిఫికెట్లు పంపిణీ చేశారన్నారు. ఎఒ లోకనాథ్ మాట్లడుతూ రెండు సంవత్సరాల శిక్షణ పూర్తి చేసిన క్యాడెట్లకు ఏ సర్టిఫికేట్ ఇవ్వబడుతుందని ఇది ఎన్‌సిసిలో క్యాడెట్ భాగస్వామ్యానికి ప్రవేశస్థాయి గుర్తింపుగా పని చేస్తుందని చెప్పారు. ఎన్‌సిసి కార్యకలాపాలు, కసరత్తులు, నాయకత్వ లక్షణాలపై ప్రాథమిక పరిజ్ఞానాన్ని ప్రదర్శిస్తుందని అన్నారు. సీనియర్ డివిజన్ విభాగంలో రెండు సంవత్సరాల శిక్షణ పూర్తి చేసిన క్యాడెట్‌లకు బి సర్టిఫికేట్ ఇవ్వబడుతుందని, ఇది ధృవీకరణ రెండవస్థాయి, అధునాతన కసరత్తులు, నాయకత్వ పాత్రలు, శిబిరాలు, సామాజిక సేవా కార్యక్రమాలలో పాల్గొనడం వంటి లోతైన ప్రమేయాన్ని సూచిస్తుందన్నారు. బి సర్టిఫికేట్ విలువైందని ఉన్నత విద్య , సాయుధ దళాలలో నియామకాలలో ప్రయోజనాలను అందిస్తుందని పేర్కొన్నారు.ఎన్‌సిసితో నాయకత్వ లక్షణాలు ఏర్పడతాయని అన్నారు. ప్రతిభ కనప రిచిన విద్యార్థులను కళాశాల కరెస్పాండెట్ డాక్టర్ ఎన్.వి జయభాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ళ, ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్, ఎన్‌సిసి లెఫ్ట్‌నెంట్ డాక్టర్ ఎన్.నవీన్ కుమార్, అభినందనలు తెలిపారు.

దసరా ఉత్సవాల కరపత్రాలు ఆవిష్కరణ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పట్టణ పరిధిలోని మన్నూరులో ఉదయగిరి ఎల్లమ్మ దేవస్థానంలో దసరా ఉత్సవాల సందర్భంగా జరగబోవు కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాలు, ఫ్లెక్సీలను ఆదివారం ఆవిష్కరించారు. దేవస్థానం కమిటీ అధ్యక్షులు నక్కా సాయిప్రసాద్, మేనేజర్ పోతుల సుధాకర్, టిటిడి హిందూ ధర్మ ప్రచార పరిషత్తు జిల్లా ప్రోగ్రామ్ అసిస్టెంట్ టి. గోపి బాబు, ధర్మాచార్యులు గంగనపల్లి వెంకటరమణ, ఆలయ అర్చకులు కొర్రపాటి రవి మోహన్‌స్వామి, కొర్రపాటి నవీన్ కుమార్‌స్వామి కరపత్రాలు, ఫ్లెక్సీలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్టోబరు 3న ఎల్లమ్మ తల్లి శైల పత్రిక అలంకారంలోను, 4న బ్రహ్మచారిణి గాను, 5న చంద్రఘంట అలంకారములోను, 6న కూష్మాండ అలంకారంలోను, 7న స్కందమాత అలంకారంలోను, 8న కాత్యాయిని అలంకారంలోను, 9న కాళరాత్రి అలంకారంలోను, 10న మహా గౌరీ అలంకారంలోను, 11న సిద్ధి ధాత్రి అలంకారంలోను, 12న ఉదయగిరి ఎల్లమ్మ తల్లి అలంకారంలోను భక్తులకు దర్శనం ఇవ్వనున్నారని తెలిపారు. 4న సాయంత్రం హైదరాబాద్ వాస్తవ్యులు కోటపాటి వెంక టేశ్వర గోవింద దాసచే అమ్మవారి అన్నమాచార్య సంకీర్తన వైభవం కార్యక్రమం ఉంటుందన్నారు.

దసరా ఉత్సవాలకు చమర్తికి ఆహ్వానం

పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి రాజంపేట ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో జరగనున్న శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మహోత్సవాల ఆహ్వన పత్రికను టిడిపి పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్‌మోహన్‌రాజుకు అందించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ నాయకులు తుమ్మలపెంట సుబ్బారావు, కార్తీక్, మేడా ముని బాలకృష్ణ, కర్ణాటకం విజయ్, డమాల్ సాయి పాల్గొన్నారు.

బాధితులకు సిఎం సహాయనిధి పంపిణీ

ప్రజాశక్తి-మదనపల్లి

ప్రమాదంలో గాయపడిన గాయపడిన స్థానిక బాలాజీ నగర్ చెందిన చాంద్‌బాషా సెప్టెంబర్ 15న రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి బెంగళూరు మణిపాల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధి తుల కుటుంబ సభ్యులు మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్‌బాషాను కలిసి ఆర్థిక సహాయం కోరారు. తన వంతు సాయం అందించిన అనంతరం సిఎం రిలీఫ్ ఫండ్ నుంచి 5 లక్షల రూపాయలు చెక్కును బాధిత కుటుంబ సభ్యులు చాంద్ భాషా వదిన ఆయిషాకు ఎమ్మెల్యే తనయుడు జునైద్ అక్బర్ చేతుల మీదుగా అందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం సహాయనిధి పేదలకు వరం లాంటిందని అన్నారు. ప్రజారోగ్యానికి సిఎం చంద్రబాబు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని పేర్కొన్నారు.



బాధిత కుటుంబానికి చెక్కును అందిస్తున్న జునైద్ అక్బర్



జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

జిల్లా స్థాయి రోప్ స్కిప్పింగ్‌లో బాలబాలికల జట్లు ఎంపిక

ప్రజాశక్తి- రైల్వేకోడూరు

అండర్-19 ఎస్‌జిఎఫ్ రోప్ స్కిప్పింగ్‌లో జిల్లా స్థాయి బాల బాలికల జట్లను ఎంపిక చేసినట్లు ఎస్‌జిఎఫ్ కార్యదర్శి శారద తెలిపారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్ఎస్ స్పోర్ట్స్‌లో జిల్లా స్థాయి పోటీలు నిర్వహించామని అందులో జిల్లా నుంచి 110 మంది బాలబాలికలు పాల్గొన్నారని తెలిపారు. బాలికల జట్టుకు ఎస్ సుమ,వి వైష్ణవి, డి.జ్యోతిష, ఎస్ షకీనా, ఎ.హిమశ్రీ, పి.నాగసమంత, స్టాండ్ బై సౌమ్య, వాణి, బాలుర జట్టుకు డి.నితీష్ కుమార్ ,కె రెడ్డి గణేష్, జి.ప్రవీణరాజ్ కుమార్, మధు గౌతమ్ లను ఎంపిక చేసామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో పీడీ సుబ్బరాజు, ఆర్ ఎస్ స్పోర్ట్స్ నిర్వాహకులు రవిరాజు, వెంకటేష్, నరసింహ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన వర్షితరాజ్

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని ఎపి మోడల్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న వర్షిత రాజ్ ఎస్‌జిఎఫ్ అండర్-19 బాలికల స్కేటింగ్ క్రీడా పోటీలు గవర్నమెంట్ జూనియర్ కళాశాల కోడూరులో ఆదివారం జిల్లాస్థాయి పోటీలు నిర్వహించగా అందులో అద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొనునట్లు పీడీ నీలకంఠేశ్వరరావు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన హర్షిత రాజును కళాశాల ప్రిన్సిపల్ లీలా శ్రీహరి, పాఠశాల బృందం ప్రత్యేక అభినందనలు తెలిపారు.



బాధితుడిని పరామర్శిస్తున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు

టిడిపి నాయకుడిని పరామర్శించిన 'చమర్తి'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న టిడిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి మందా శ్రీనివాసులును రాజంపేట పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు చమర్తి జగన్‌మోహన్‌రాజు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి నాయకులు విచక్షణ రహితంగా శ్రీనివాసులుపై దాడి చేయడం హేయనీమైన చర్యని అన్నారు. ఈ ఘటనను హైకమాండ్ దృష్టికి తీసుకెళతామని అన్నారు. ఎస్‌పితో మాట్లాడి రక్షణ కల్పించడమే కాక ప్రభుత్వం తరపున ఖచ్చితంగా న్యాయం చేస్తామని బాధితుడికి హామీ ఇచ్చారు.

సామాజిక సేవే లక్ష్యం

ప్రజాశక్తి-పీలేరు : సామాజికసేవలు చేస్తూ, ప్రజలతో మైత్రి, సహచరుల్లో నాయకత్వాన్ని పెంచడమే జాతీయ వాసవి క్లబ్ సెంటర్ లక్ష్యమని రీజియన్ -1 చైర్ పర్సన్ పామిడి జయచంద్ర తెలిపారు. ఆదివారం వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ రికాన్ పామిడి ఉషా జయచంద్ర అధ్యక్షతన పీలేరు శ్రీ ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో, వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ డిస్టిక్ వి211ఎ రీజన్ -1లోని పీలేరు వాసవి క్లబ్ గ్రేటర్, పీలేరు వాసవి కపుల్స్ క్లబ్, కల్లూరు వాసవి క్లబ్, చిన్నగొట్టిగల్లు వాసవి ఫ్యామిలీస్, మదనపల్లి వాసవి క్లబ్ గ్రేటర్, మదనపల్లి వాసవి క్లబ్ వనిత క్లబ్, బి. కొత్తకోట వాసవి వనిత క్లబ్, బి. కొత్తకోట వాసవి క్లబ్ మొత్తం ఎనిమిది క్లబ్బులు సంయుక్తంగా కార్యక్రమాన్ని నిర్వహించాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ అంటేనే ప్రతి ఒక్కరికీ సేవా కార్యక్రమాలు గుర్తుకొస్తాయని, సేవతో పాటు ఫెలో షిప్, లీడర్ షిప్ కూడా పెంపొందించుకుంటూ ముందుకు వెళ్లడమే జాతీయ వాసవి క్లబ్ సెంటర్ నేషనల్ యొక్క లక్ష్యమని అన్నారు. తాము చేపట్టిన సేవా కార్యక్రమాల్లో భాగంగా పీలేరు ఆర్టీసీ బస్టాండ్ లో అమ్మకు గౌరవం పేరుతో 'తల్లి పాలు ఇచ్చు గది' ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వాగ్దేవి, విద్యా గణపతి మందిరాన్ని ఏర్పాటు చేశామన్నారు.

క్రైం కార్నర్



నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు

ఘరానా దొంగ అరెస్టు

-రూ.28 లక్షల నగలు స్వాధీనం : డిఎస్‌పి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పలు ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడి నగలు దోచుకున్న ఘరానా దొంగను మదనపల్లె తాలూకా పోలీసులు పట్టుకున్నారు. ఈ మేరకు ఆదివారం స్థానిక తాలుకా పోలీసు స్టేషన్‌లో డిఎస్‌పి కొండయ్య నాయుడు, సిఐ కళా వెంకటరమణ లు నిందితుడిని అరెస్టు చూపించారు. అరెస్టుకు సంబంధించి డిఎస్‌పి కొండయ్య నాయుడు మాట్లాడుతూ కర్ణాటక రాష్ట్రం, కోలార్ జిల్లా, శ్రీనివాసపురం తాలూకా, గంగరాగాని పల్లెకు చెందిన చలపతి కుమారుడు టిసి నాగరాజా గత కొన్ని సంవత్సరాలుగా దొంగతనాలకు పాల్పడుతూ పలు ఇళ్లల్లో చోరీలు చేసేవాడు. మదనపల్లె తాలూకా పరిధిలోని పలు ప్రాంతాల్లో దొంగతనాలు జరిగాయని అన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు సిఐ కళా వెంకటరమణ, ఎస్ఐ హరిహర ప్రసాద్‌లు సిబ్బందితో కలిసి చోరీకి పాల్పడిన నిందితుడి కోసం గాలింపు చేపట్టి నిఘా పెట్టినట్లు చెప్పారు. ఆదివారం స్థానిక పుంగనూరు రోడ్డులోని ఈశ్వరమ్మ కాలనీ వద్ద నిందితుడు కొల్లగొట్టిన నగలను సొమ్ము చేసుకోవడానికి వస్తున్నట్లు సమాచారం రావడంతో కాపుగాచి అదుపులోకి తీసుకున్నారని అన్నారు. నిందితుడిని విచారించగా నేరం చేసినట్లు ఒప్పుకున్నాడని అన్నారు. అతని వద్ద రూ. 28 లక్షల విలువైన 400 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.12వేలు విలువైన 120 గ్రాముల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకొని అరెస్టు చేశారు. ఈ దొంగతనం కేసులో ఓ మైనర్ సంబంధం ఉండడంతో ఆ బాలున్ని జువైనల్ కోర్టుకు తరలించినట్లు తెలిపారు. టిసి నాగరాజుపై గతంలో పలు మద్యం కేసులు, చోరీ కేసులు, ఓ హత్య కేసు కూడా నమోదైనట్లు డిఎస్‌పి తెలిపారు. ఇతను గతంలో ఓ కేసులో పీలేరు పోలీసు స్టేషన్‌లో అరెస్టయి తప్పించుకొని పరారయ్యాడని పేర్కొన్నారు. నిందితుడిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు. ఈ కేసును చాకచక్యంగా ఛేదించి, విలువైన బంగారు, వెండి ఆభరణాలు రికవరీ చేసిన సిబ్బంది ని అభినందించారు. సిఐ కళా వెంకటరమణ, ఎస్ఐ హరిహర ప్రసాద్, క్రైమ్ పార్టీ సిబ్బంది రాఘవ, శంకర, శివ, శంకర్, నరసింహులు, మహమ్మద్, ఏఎస్ఎస్ సుబ్రహ్మణ్యం లకు రివార్డులు అందించారు.